

## శాస్త్రోక్తంగా సంకట హర చతుర్థి

ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సోమవారం నుంచి నూతన ఆర్జిత సేవ సంకట హర చతుర్థి సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది.



## నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2000, గరిష్ట ధర రూ.4800, మోడల్ ధర రూ.3400 వరకు పలికింది.

## తానా సభలకు ఆహ్వానం



గుంటూరుఎడ్యుకేషన్: తానా ఆధ్వర్యంలో జూలైలో అమెరికాలో జరగనున్న సభలకు హాజరు కావాల్సిందిగా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు ఆహ్వానం అందింది.

## న్యూస్‌రీల్

### 'సాక్షి' ఆధ్వర్యంలో రేపు ఉచిత చెస్ శిక్షణ

గుంటూరువెస్ట్: యువతలోని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక బ్రాడీపేట 3/11 మాస్టర్‌మైండ్స్ బాలాజీ క్యాంపస్(వజ్రం హోటల్ వెనుక)లో ఉచిత ప్రత్యేక చెస్ శిక్షణ కార్యక్రమం జరగనుంది. మాస్టర్‌మైండ్స్ సౌజన్యంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పేరొందిన శిక్షకులచే మెలకువలు నేర్పిస్తారు. ముందుగా వచ్చిన 30 మందికి మాత్రమే అవకాశం. ఉచితంగా శిక్షణతోపాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్, ప్రోత్సాహక బహుమతి కూడా ఇవ్వడం జరుగుతుంది. రిజిస్ట్రేషన్‌కు అంజిబాబును 92484 45648 నెంబర్‌లో సంప్రదించగలరు.

### గుంటూరు దిశ డీఎస్పీగా రామారావు బాధ్యతలు స్వీకరణ



పట్నంబజారు: గుంటూరు దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీగా కె.సి.హెచ్.రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1991 బ్యాచ్ ఎస్‌ఐ అయిన రామారావుకు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేసిన అనుభవం ఉంది. 2011లో ఆయన సీఐగా పదోన్నతి పొంది, నెల్లూరు పరిసర ప్రాంతాల్లో పనిచేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన సీఐడీ కర్నూలు జిల్లాలో పనిచేశారు. అనంతరం బదిలీల్లో భాగంగా గుంటూరు దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ కలహాల నేపథ్యంలో స్టేషన్‌కు వచ్చే ప్రతి కుటుంబ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా మహిళలు, విద్యార్థినులు, యువతులతో అసభ్యకరంగా ప్రవర్తించి, వేధించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పారా మెడికల్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరుమెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పారా మెడికల్ ఉద్యోగాలను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఉద్యోగాలకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హతలు, పోస్టుల వివరాలు, దరఖాస్తు ఫారాల కోసం గుంటూరుఏపీ.ఇన్/ఎంహెచ్2023 వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. ఆన్‌లైన్‌లో కాకుండా వ్యక్తిగతంగా ఇతర మాధ్యమాల ద్వారా దరఖాస్తులు స్వీకరించరని, ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు.


### మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

మార్క్‌ఫెడ్ డీఎం కరుణ



మార్టూరు: రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మార్క్‌ఫెడ్ డీఎం కరుణ అన్నారు. మండలంలోని వలపర్ల గ్రామంలో సోమవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆమె అధికారులు, రైతులతో మాట్లాడారు. తేమ శాతం 14 శాతం కంటే తక్కువ, ఇతర వ్యర్థాలు 1 శాతం లోపు ఉండాలన్నారు. రైతులు ఆర్బీకే సెంటర్లలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లోకనాథం, ఏఓ వీ కిరణ్‌కుమార్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

### యార్డుకు 1,00,102 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,00,102 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 96,526 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,054 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

# అన్నదాతకు మద్దతు

చీరాల మండలం, పిట్టువారిపాలెం గ్రామానికి చెందిన పిట్టు నరేంద్ర తాను పండించిన ధాన్యాన్ని గ్రామంలోని రైతుభరోసా కేంద్రం ద్వారా ఏప్రిల్ 29న విక్రయించారు. అతనికి ట్రక్‌షీట్ జనరేట్ చేసిన తర్వాత ధాన్యాన్ని చీరాలలోని రైస్‌మిల్‌కు చేర్చాలని ఆర్‌బీకే సిబ్బంది సూచించారు. 68 క్వింటాళ్ల ధాన్యాన్ని అదే మిల్లుకు తరలించారు. క్వింటాకు రూ. 2060 చొప్పున ఈనెల 5న 68 క్వింటాళ్లకు గానూ మొత్తం రూ.1,40,080 అతని ఖాతాలో జమయ్యాయి. దీంతో ఆ రైతు హర్షం వ్యక్తం చేశారు.

పిట్టలవానిపాలెం మండలం, పోతనకట్టవారిపాలెం గ్రామానికి చెందిన మెండు బిందుమాధవి తనకున్న పొలంలో గ్రేడ్-ఏ రకం వరిపంటను సాగుచేశారు. ఆ పొలంలో 57.2 బస్తాల దిగుబడి వచ్చింది. వీటిని గ్రామంలోని రైతుభరోసా కేంద్రం ద్వారా ఏప్రిల్ 30న విక్రయించారు. క్వింటాకు రూ. 2060 చొప్పున మొత్తం రూ. 1,17,832 నగదు ఈనెల 3వ తేదిన జమ చేశారు. గతంలో దళారులు ధాన్యం కొనుగోలు చేసి రెండు నెలలు గడిచినా నగదు చెల్లించేవారు కాదని, ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతో పాటు ధాన్యం కొనుగోలు చేసిన నాలుగు రోజుల వ్యవధిలోనే నగదు జమచేయటం సంతోషంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేశారు.

### రైతులకు అండగా ప్రభుత్వం

- మద్దతు ధరకు శరవేగంగా రబీ ధాన్యం కొనుగోళ్లు
- కొనుగోలు చేసిన వారం వ్యవధిలోనే నగదు జమ
- ఖరీఫ్‌లో 10,876 మంది రైతుల నుంచి 78,330 టన్నుల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లో ఖరీఫ్ సొమ్ము రూ. 161.29 కోట్లు జమ
- రబీ ప్రారంభం నాటికే ఖరీఫ్ సొమ్ము పూర్తిగా చెల్లింపు
- సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



కల్లాల్లోని ధాన్యాన్ని గోతాల్లో నింపుకొంటున్న రైతులు



మహిళా రైతు మెండు బిందు మాధవి

బాపట్లటౌన్: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలు సంతోషంగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని గ్రహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు రైతులు పండించిన అన్నిరకాల పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించారు. ధరలను కల్పించడమే కాకుండా ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధర రైతులకు చెందకుండా మధ్యలో దోచుకుంటున్న దళారీ వ్యవస్థను పూర్తిస్థాయిలో నివారించారు. దానిలో భాగంగా ప్రభుత్వమే నేరుగా ధాన్యాన్ని కొనుగోలుచేసి వారం రోజుల తిరగకుండానే రైతుల ఖాతాల్లో నగదు జమచేసి రైతులపై తమకున్న ప్రేమను చాటుకున్నారు.



ధాన్యం లోడుతో మిల్లుకు బయల్దేరిన రైతు పిట్టు నరేంద్ర

### గిట్టుబాటు ధరలకు ధాన్యం కొనుగోలు..

రైతులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరను పెంచింది. గతంలో సాధారణ రకం క్వింటా రూ. 1940 ఉండగా ప్రస్తుతం రూ. 2040 చేసింది. అదేవిధంగా ఏ గ్రేడ్ రకం గతంలో రూ.1960 ఉండగా ప్రస్తుతం రూ. 2060కు పెంచింది. ధాన్యం కొనుగోలుకు అవసరమైన సంచులను, రవాణా ఖర్చులను కూడా ప్రభుత్వమే సమకూరుస్తోంది.

| నియోజకవర్గం | రైతులు | కొనుగోలు చేసిన ధాన్యం | జమచేసిన నగదు |
|---|---|---|---|
| బాపట్ల | 773 | 4569.72(ఎం.టి) | రూ. 2.06 కోట్లు |
| చీరాల | 120 | 824.08 | రూ.66 లక్షలు |
| పర్చూరు | 50 | 393.12 | రూ.43 లక్షలు |
| రేపల్లె | 1228 | 7060.52 | రూ.2.08 కోట్లు |
| వేమూరు | 73 | 668.52 | రూ.55 లక్షలు |
| మొత్తం | 2244 | 13,516.96 | రూ.6.5 కోట్లు |

### వారం రోజుల్లోనే నగదు జమ



జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి వెంటనే నగదు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే డిసెంబర్ 7 నుంచి మార్చి 31తో ముగిసిన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన రూ.161.29 కోట్లు పూర్తిగా చెల్లించాం. ఏప్రిల్ 10 నుంచి ప్రారంభమైన రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటికీ 2244 మంది రైతుల నుంచి 13,516 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. వారికి సంబంధించి రూ.27.84 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికే రూ.6.5 కోట్లు చెల్లించాం. ధాన్యం విక్రయించిన ప్రతి రైతుకు వారం రోజుల వ్యవధిలోనే నగదు జమ చేస్తున్నాం.

– వి. శ్రీలక్ష్మి, జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్

### వారం వ్యవధిలోనే నగదు జమ...

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం డిసెంబర్ 7 నుంచి మార్చి 31 వరకు కొనుగోలు చేసింది. జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 25 మండలాలు ఉండగా వాటి పరిధిలో 153 రైతు భరోసా కేంద్రాలున్నాయి. వాటి ద్వారా ఖరీఫ్ సీజన్‌లో 10,876 మంది రైతుల నుంచి 78,330 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం తాలుకా రైతులకు రబీ సీజన్ ప్రారంభానికి వారం రోజుల ముందే రూ. 161.29 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమచేసి రైతులపై తమకున్న ప్రేమను చాటుకున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఖరీఫ్ సీజన్ ముగిసిన రెండు, మూడు నెలలకు కూడా ధాన్యం నగదు రైతులకు అందగా దళారులు ఇష్టమొచ్చినప్పుడు ఇచ్చే రోజులను చూసిన రైతులు ప్రస్తుత పరిస్థితిపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### 15న సీఎం వైఎస్ జగన్ బాపట్ల జిల్లా రాక

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడి



సభ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణా రావు

బాపట్ల: వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీన బాపట్ల జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. సీఎంఓ నుంచి అధికారికంగా సమాచారం అందిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నిజాంపట్నంలో ఖరారైనట్లు ఆయన తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతున్నందున అధికారులంతా సమష్టిగా జయప్రదం చేయాలని సూచించారు. నిజాంపట్నం మండలంలో సీఎం సభాస్థలి ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ ప్రాంతాలను గుర్తించాలని రేపల్లె ఆర్డీఓను ఆదేశించారు. జేసీ సీహెచ్ శ్రీధర్, డీఆర్ఓ కె.లక్ష్మీశివజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**స్థల పరిశీలన చేసిన ఎంపీ మోపిదేవి..**

నిజాంపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 15వ తేదీ నిజాంపట్నం రానున్న నేపథ్యంలో సోమవారం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు సభ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. మోపిదేవి మాట్లాడుతూ మత్స్యకార భరోసా నిధుల విడుదల కార్యక్రమం నిజాంపట్నంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సభాప్రాంగణం, హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మత్స్యకారులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. రేపల్లె ఆర్డీఓ పి.జగన్నాథం, తహసీల్దార్ శిరీష, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# చీరాల టీడీపీలో మరో చిచ్చు

- సీటు మాదంటే మాదేనంటూ ప్రచారం
- మీడియా సమావేశం పెట్టి ఒకరిపై మరొకరు విమర్శలు
- తలలు పట్టుకుంటున్న తమ్ముళ్లు





ఎంఎం కొండయ్య



కాంద్రు శ్రీనివాసరావు

చీరాల: నియోజకవర్గంలో టీడీపీ చీలికలు పేలికలుగా మారింది. ఇప్పటికే వర్గపోరు, పోటాపోటీ కార్యక్రమాలతో సతమతమవుతున్నారు. మరో వైపు క్యాడర్ లేక అవస్థలు పడుతున్నారు. సీట్ల రగడతో టీడీపీ నేతలు మరీ దిగజారి ఒకరిపై ఒకరు మీడియా సమావేశాలు పెట్టి ఆరోపణలు సంధించుకోవడం విశేషం. ప్రస్తుతం ఎంఎం కొండయ్య టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. మంగళగిరికి చెందిన కాంద్రు శ్రీనివాసరావు గత కొద్ది నెలలుగా చీరాలలో మకాం వేసి చీరాల సీటు చేనేతలదేనని అందులో భాగంగా తమకే ఇచ్చేందుకు లోకేష్ అంగీకరించారని ప్రచారం చేస్తున్నారు. మంగళగిరి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన కాంద్రు శ్రీనివాసరావు చేనేత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. ఆయన, అనుచరులు ఆదివారం రామాపురంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చీరాలలో చేనేతలు అధికంగా ఉన్నారని, అక్కడ వారి సమస్యలు పరిష్కరించి పార్టీని బలోపేతం చేయాలని తమకు లోకేష్ సూచించారన్నారు. మరో అడుగు ముందుకేసి మంగళగిరిలో తాము లోకేష్‌కు సహకరిస్తే చీరాలలో సీటు కోసం తాను సహకరిస్తానని లోకేష్ అన్నట్లుగా కాంద్రు శ్రీనివాసరావు అనుచరులు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన చేనేత ప్రాంతాల్లో ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఒక విధంగా చెప్పాలంటే సీటు తమకే వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు.

**వ్యతిరేక వర్గం కౌంటర్..**

అయితే దీనిని వ్యతిరేకిస్తూ సోమవారం కొత్తపేటలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య అనుచరులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అసలు కాంద్రు శ్రీనివాసరావు ఎవరని.. చీరాలలో రాజకీయం చేయడం ఏంటని ప్రశ్నించారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు ఆయన ప్రత్యేకంగా ప్రెస్‌మీట్‌లు పెట్టడం ఏంటని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇన్‌చార్జికి తెలియకుండా ప్రెస్‌మీట్‌లు పెడితే ఎలాగంటూ ఒకింత గట్టిగా హెచ్చరించారు. ఈ వ్యవహారంపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతానని అన్నారు. ఇన్‌చార్జి ఆధ్వర్యంలోనే ఎవరైనా వచ్చి పనిచేయాలని, లేకుంటే పద్ధతిగా ఉండదన్నారు. కులాలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయవద్దని హెచ్చరించారు. ప్రెస్‌మీట్ జరుగుతున్న సమయంలో పక్క గదిలో ఎంఎం కొండయ్య ఉండి అనుచరులతో సమావేశం నిర్వహింపచేయడం విశేషం. ఈ పరిణామాలతో తెలుగుదేశం పార్టీలో మళ్లీ అగ్గి రాజుకున్నట్లయింది. ఇప్పటికే నియోజకవర్గంలో కొండయ్య ఒక వర్గానికి నాయకత్వం వహిస్తుండగా నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి యడం బాలాజీ పార్టీ కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. దీనికి తోడు పట్టణ మాజీ అధ్యక్షుడు దేటా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు పోటీగా జరుగుతున్నాయి. పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను ఇప్పటికే ముగ్గురు నిర్వహిస్తుండగా ఎన్నికల సమయం ఆసన్నమవడంతో సీట్ల విషయంలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. అయితే టీడీపీ క్యాడర్ మాత్రం టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్సార్ సీపీలోకి వచ్చిన కరణం బలరామ కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ వైపు అధికంగా ఉండడం విశేషం.

# అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- స్పందనలో 102 అర్జీలు



స్పందన అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: స్పందనలో వచ్చిన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. స్పందన కార్యక్రమం సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. మొత్తం 102 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలోని సమస్యలకు కలెక్టర్ తక్షణమే పరిష్కారం చూపగా, మిగిలిన వాటిని నిశితంగా పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. స్పందన అర్జీలపై నిర్లిప్తత తగదని అధికారులకు సూచించారు. అర్జీల స్వీకరణ అనంతరం వీడియో సమావేశం ద్వారా మండలస్థాయి అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. రీసర్వే ప్రక్రియలో హద్దురాళ్ల ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈప్రక్రియలో బాపట్ల జిల్లా పురోగతి తక్కువగా ఉండడంపై అధికారులను నిలదీశారు. తహసీల్దార్లు నిర్లిప్తంగా ఉండడం మంచిపద్ధతి కాదన్నారు. విధి నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టరు సి.హెచ్.శ్రీధర్, డీఆర్ఓ కె.లక్ష్మీశివజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 521.90 అడుగుల వద్ద ఉంది. ఇది 152.7628 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలంజలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,350క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలంజలాశయం నీటిమట్టం 808.10 అడుగుల వద్ద ఉంది. ఇది 33.2019 టీఎంసీలకు సమానం.

# లూపస్.. వెరీ డేంజరస్

గుంటూరు నగరానికి చెందిన 25 ఏళ్ల రజినికి వివాహమై మూడేళ్లయినా సంతానం కలగలేదు. ఆరు నెలలుగా కీళ్ల నొప్పులు ఉన్నా పట్టించుకోకుండా తన రోజువారీ పనులు చేసుకుంటుంది. కీళ్ల నొప్పులకు తోడు ఆయాసం వస్తుండడంతో ఓ రోజు భర్తకు తన ఆరోగ్య పరిస్థితి తెలియజేయటంతో వారం రోజుల క్రితం ఆస్పత్రికి వెళ్లారు.. డాక్టర్లు పరీక్షలు చేసి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని దీనికి కారణం లూపస్ వ్యాధి అని చెప్పడంతో వారు హతాశులయ్యారు.

- వ్యాధి గుర్తించేలోగా మృత్యువాత
- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నియంత్రించే అవకాశం
- వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలంటున్న వైద్యులు
- ఈనెల 10న వరల్డ్ లూపస్ డే


గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా సుమారు 50లక్షల మంది లూపస్ వ్యాధితో బాధపడుతున్నారు. లూపస్ వ్యాధిపై ప్రజలతోపాటుగా వైద్యులకు కూడా సరైన అవగాహన లేకపోవటం వల్లే ముందస్తుగా వ్యాధిని గుర్తించలేకపోతున్నట్లు వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రతిరోజూ కిడ్నీలు ఫెయిల్ అయ్యి తమ వద్దకు వస్తున్న వారిలో లూపస్ వ్యాధి బాధితులు అధికంగా ఉన్నారని గుంటూరుకు చెందిన సీనియర్ కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ చింతా రామకృష్ణ వెల్లడించారు. ఈనెల 10న ప్రపంచ లూపస్ డే సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

**లూపస్ వ్యాధి ఎందుకొస్తుంది?**

లూపస్ అంటే లాటిన్‌లో తోడేలు అని అర్థం. ఇది ఆటోఇమ్యూనో వ్యాధి. ఈ వ్యాధి ఎందుకు వస్తుందో, ఎలా ప్రవర్తిస్తుందో కారణాలు పూర్తిగా తెలియదు. సాధారణంగా శరీరంలో ఉన్న ఇమ్యూనిటీ సిస్టమ్ బయటి నుంచి వచ్చే ఇన్‌ఫెక్షన్‌లు, ఫారిన్ బాడీస్‌ను ఎదుర్కొని మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి తోడ్పడుతుంది. ఇమ్యూనిటీ సిస్టమ్‌లో లోపాల వల్ల శరీరంలో వివిధ అవయవాల్లో ఉండే సాధారణ కణాలు ఫారిన్‌బాడీస్ వల్లే గుర్తింపబడి సాధారణ కణాలు విచ్చిన్నమై అవయవాలు దెబ్బతినడం వల్ల లూపస్ వ్యాధి వస్తుంది.

**జిల్లాలో బాధితులు...**

లూపస్ వ్యాధి ముఖ్యంగా మహిళల్లో వస్తుంది. ప్రతి పది మంది వ్యాధిగ్రస్తుల్లో 8 మంది మహిళలే. 18 నుంచి 45 వయస్సులో ఉన్న వారికి ఈవ్యాధి వస్తుంది. మగవారిలో, చిన్నపిల్లల్లో, వృద్ధాప్యంలో ఉన్నవారికి వ్యాధి వస్తే తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా లక్ష జనాభాలో వంద మంది లూపస్ వ్యాధి బాధితులు ఉన్నారు. గుంటూరులో నలుగురు రుమటాలజీ వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతినెలా ఒక్కో డాక్టర్ వద్దకు పది మంది వ్యాధి బాధితులు చికిత్స కోసం వస్తున్నట్లు తెలిపారు.





వరల్డ్ లూపస్ డే పోస్టర్

**వ్యాధి లక్షణాలు..**

లూపస్ వ్యాధి ఏ క్షణంలోనైనా, ఏవిధంగానైనా, ఏ అవయవాన్నైనా దెబ్బతిస్తుంది. తల నుంచి కాళ్ల వరకు, కిడ్నీల నుంచి గుండె వరకు అన్ని అవయవాలపై ఈ వ్యాధి దాడికి దిగి అవయవాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. దీర్ఘకాలంగా జ్వరం ఉండటం, బరువు తగ్గడం, విపరీతమైన నీరసం, కీళ్ల నొప్పులు, జుట్టు రాలడం, నోటిపూత, రక్తకణాలు తగ్గడం, మూత్రపిండాలు పాడవడం, మూర్ఛ వ్యాధి, అబార్షన్లు, పిల్లలు లేకపోవటం, బహిష్టు సమయంలో అధిక రక్తస్రావం, ముఖంపై, శరీరంపై సీతాకోకచిలుక ఆకారంలో దద్దుర్లు కనిపించడం వ్యాధి లక్షణాలు.

**తొలిదశలో గుర్తించవచ్చు..**

పైన పేర్కొన్న లక్షణాలు ముఖ్యంగా యుక్తవయస్సులో ఉన్న మహిళల్లో కనిపిస్తే తక్షణమే రుమటాలజిస్టును సంప్రదిస్తే ఏఎన్‌ఏ, డీఎస్‌డీఎన్ఏ రక్తపరీక్షల ద్వారా వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించవచ్చు. లూపస్ వ్యాధి నిర్ధారణ చేసే సమయానికే కనీసం మూడేళ్ల ముందుగానే శరీరంలో మార్పులు జరుగుతాయి. కొన్ని సార్లు వైద్యులు వ్యాధిని గుర్తించేలోగా కిడ్నీ ఫెయిల్యూర్, మూర్ఛ వ్యాధి, గుండెజబ్బుల వల్ల మరణం సంభవిస్తుంది. హార్మోన్ల అసమతుల్యత వల్ల, జన్యుపరమైన లోపాల వల్ల వివిధ పర్యావరణ కారకాల వల్ల వ్యాధి సంభవిస్తుంది.

### కిడ్నీలను దెబ్బతీస్తుంది..



లూపస్‌వ్యాధి కిడ్నీలో నెఫ్రాన్స్‌ని దెబ్బతీస్తూ రక్తాన్ని శుద్ధి చేయకుండా చేయటం వల్ల కిడ్నీలు ఫెయిల్ అవుతాయి. మొదటి దశలో వ్యాధిని గుర్తిస్తే కిడ్నీలు పూర్తిగా పాడవకుండా కాపాడి పనిచేసేలా చేయవచ్చు. వైద్య చికిత్సలతో వ్యాధి బాధితులకు 80శాతం ఉపశమనం లభిస్తుంది. లూపస్ నెఫ్రిటీస్ వ్యాధి మొదటి దశలో గుర్తించి చికిత్స చేయవచ్చు.

– డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

### అవగాహనతో నియంత్రణ ..



అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో తగిన మోతాదులో సరైన సమయంలో మందులు వాడితే వ్యాధిని నియంత్రణలో పెట్టవచ్చు. లూపస్ వ్యాధికి సరైన చికిత్స తీసుకోని పక్షంలో మరణాలు సంభవించే అవకాశం ఉంది. తొలిదశలోనే గుర్తించి నియంత్రణలో పెట్టడం ద్వారా మరణాలు సంభవించకుండా చూడవచ్చు.

– డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ, రుమటాలజిస్టు, గుంటూరు

## క్లుప్తంగా

### ఐఏఎల్ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీగా కుమారి నంద



**అద్దంకి రూరల్:** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీగా సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది పర్చూరు కుమారి నంద ఎన్నికయ్యారు. ఈనెల 7న ఆదివారం రాజమండ్రిలోని రివర్‌బే కన్వెన్షన్ హాల్లో ఐఏఎల్ 11వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. సంఘ డెప్యూటీ జనరల్ సెక్రటరీగా కుమారి నంద ఎన్నిక కావడంతో ఆమె తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వేణుగోపాల్



**సత్తెనపల్లి:** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ ఎన్నికయ్యారు. రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ రివర్ బే హాలులో ఆదివారం జరిగిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఏపీ రాష్ట్ర 11వ మహాసభలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభల్లో పలువురు న్యాయమూర్తులు, రాష్ట్రవ్యాప్తంగా డెలిగేట్స్‌గా 600మంది న్యాయవాదులు పాల్గొన్నారు. జూన్–1 నుంచి 4 వరకు త్రివేండ్రంలో జరగనున్న ఐఏఎల్ జాతీయ మహాసభలకు డెలిగేట్‌గా కూడా న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ ఎంపికయ్యారు.

# జగనన్న పాలనలో సామాజిక న్యాయం

- ఎంపీ నందిగం సురేష్, శాప్‌నెట్‌ఛైర్మన్ కృష్ణచైతన్య
- బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపీ నందిగం సురేష్, కృష్ణచైతన్య

**బల్లికురవ:** బాబూ జగ్జీవన్‌రామ్ కలలుగన్న సామాజిక న్యాయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. సోమవారం రాత్రి మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాన్ని ఎంపీ రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్యతో కలిసి ఆవిష్కరించారు. అంతకు ముందు గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా అహర్నిశలూ ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి దేశంలోనే నంబర్ వన్ సీఎంగా గుర్తింపు పొందారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పారదర్శక పాలన అందిస్తున్న జగనన్న రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావటం మనందరి అదృష్టమన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో కూడా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ రాష్ట్రం కరోనా విపత్తు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ క్యాలెండర్ ద్వారా పథకాలు నిరంతరంగా అందిస్తూ పేదల హృదయాల్లో జగనన్న చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. గ్రామ నాయకుడు కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, జన్మదిన వేడుకల్లో భాగంగా ఎంపీ, చైతన్య, మాజీ ఎమ్మెల్యే బీసీహెచ్ గరటయ్య భారీ కేక్ కట్‌చేసి ప్రసాదరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ పి.మహాలక్ష్మమ్మ, కె.రాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారావు, స్థానిక నేత దేవినేని కృష్ణబాబు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, స్థానిక నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం

పోలీస్ స్పందనలో ఎస్పీ వకుల్‌జిందాల్



ఎస్పీ వకుల్‌జిందాల్‌కు సమస్యను వివరిస్తున్న వృద్ధ దంపతులు బోయిన వెంకయ్య, రత్తమ్మ

**బాపట్లటౌన్:** బాధితులకు సత్వర న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 47 మంది బాధితులు వచ్చి ఎస్పీకి నేరుగా తమ గోడు విన్నవించుకున్నారు. వారి సమస్యలను సావధానంగా విన్న ఎస్పీ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### భర్త, అత్తమామల నుంచి ప్రాణహాని

తాడేపల్లికి చెందిన నన్ను మూడేళ్ల క్రితం బాపట్ల మండలం, కనకాద్రినగర్ గ్రామానికి చెందిన దేవరకొండ తులసీకిరణ్‌కు ఇచ్చి మా పెద్దలు పెళ్లి చేశారు. ప్రస్తుతం నాకు ఒక పాప ఉంది. కొంతకాలం నుంచి నన్ను, నా బిడ్డను భర్త చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఈ విషయం అత్తమామలకు చెబితే వారు కూడా ఆయనకే సపోర్టు చేస్తున్నారు. వీరంతా కలిసి నన్ను చంపాలని చూస్తున్నారు. నన్ను, నా బిడ్డను వారి చెర నుంచి కాపాడండి.

– దేవరకొండ సింధూ, తాడేపల్లి

### మనవడు చంపాలని చూస్తున్నాడు

మాకు ఇద్దరు కుమారులు. కుమారులకు ఆస్తి పంచి ఇచ్చేశాం. మా వద్ద ఒక ఎకరం ఉంది. నా పెద్ద కుమారుడు కొడుకు, నా మనవడు బాలాజీ పొలం ఇవ్వాలని కొంత కాలంగా ఒత్తిడి చేస్తున్నాడు. ఇవ్వలేదని మనస్సులో పెట్టుకొని నాలుగేళ్ళ క్రితం కత్తితో పొట్టలో పొడిచాడు. ప్రస్తుతం మళ్లీ 10 రోజుల నుంచి చిత్రహింసలు పెడుతున్నాడు. ఏ క్షణాన చంపుతాడోనని భయంగా ఉంది. మనవడి నుంచి మమ్మలను రక్షించండి.

– బోయిన వెంకయ్య, రత్తమ్మ, బోయినవారిపాలెం, చీరాల మండలం

### అన్నదమ్ముల నుంచి రక్షించండి

అమర్తలూరు మండలం యండూరు గ్రామంలో నాకు మా తండ్రి తరఫున వచ్చిన 1.50 సెంట్ల ఇంటి స్థలం ఉంది. దానిని మా పెద్దనాన్న ఇంటూరి కోటయ్య, మా అన్నదమ్ములు ఏసోబు, ఏలియ్య, నానిబాబు, మురళీ, పెద్దమ్మ నాగేంద్రం కలిసి కబ్జాచేసేందుకు యత్నించారు. ఇదేమని నేను, నా భర్త అడిగితే గత నెల 22న మాపై దాడిచేశారు. ఈ విషయంపై అమర్తలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టినా పట్టించుకోవడం లేదు. మమ్మలను ఏం చేస్తారోనని భయంగా ఉంది.

– పోతర్లంక లలిత, అమర్తలూరు, మండలం యండూరు

# ఉత్తమ సేవలందించడంలో రెడ్‌క్రాస్ ముందు

కలెక్టర్ రంజిత్‌బాషా



విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

**బాపట్ల:** ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంలో రెడ్ క్రాస్ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు, కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ 160వ వ్యవస్థాపక దినోత్సవం స్థానిక స్పందన సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. తొలుత రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జేసీ శ్రీధర్, డీఆర్వో లక్ష్మీశివజ్యోతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ పాల్గొన్నారు. అనంతరం రెడ్ క్రాస్‌లో రెండు వందల మందికి జీవిత సభ్యత్వం చేయించిన బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గంధం రవీందర్, ప్యాట్రన్ సభ్యులను చేర్పించిన వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, ఎన్‌సీసీ అధికారి కత్తి శ్రీనివాస్‌రావు, విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ రెడ్ క్రాస్ సభ్యులు జి.జాన్ వెస్లీలను కలెక్టర్ అభినందించారు. జ్ఞాపికలతో సత్కరించారు. సంస్థ చైర్మన్ బి.ఎస్.నారాయణ భట్టు, నవనీత కృష్ణ, రామచంద్రమూర్తి, వెంకటేశ్వర్లు, గోపీకృష్ణ, టి.నాగమణి, కుమారి పాల్గొన్నారు.

### మే 28 నుంచి అఖిలభారత స్థాయి నాటక పోటీలు

**తెనాలి:** బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలోని పల్లెకోనలో ఏటా ఏప్రిల్ 27 నుంచి నిర్వహించే పరుచూరి రఘుబాబు స్మారక ట్రస్ట్ నాటకోత్సవాలు షెడ్యూల్‌ను ఈ ఏడాది మార్పు చేశారు. మేనేజింగ్ ట్రస్టీ పరుచూరి వెంకటేశ్వరరావు, సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు సోమవారం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో ఈ వివరాలను తెలియజేశారు. ఈ ఏడాది నందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా మే 28 నుంచి ఘట్టమనేని కృష్ణ జయంతి 31 వరకు అఖిల భారత స్థాయిలో డాక్టర్ డి.రామానాయుడు స్మారక నాటక పోటీలు నిర్వహించనున్నారు. తొలిరోజైన మే 28న శ్రీకళానికేతన్, హైదరాబాద్‌వారి 'ఎర్ర కలువ' నాటకాన్ని ప్రదర్శిస్తారు. 29న మిత్ర క్రియేషన్స్, నరసరావుపేట వారి 'ది ఇంపోస్టర్స్' (అంతా నిజమే చెబుతారు), చైతన్య కళాస్రవంతి, ఉక్కునగరం వారి 'సవారీ' నాటకాలను ప్రదర్శిస్తారు. 30న విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి 'సిరి మింగిన వెలగపండు', అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' నాటకాలను ప్రదర్శిస్తారు. చివరి రోజైన మే 31న విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి 'కలనేత' నాటక ప్రదర్శన అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటాయని వివరించారు.

### కృష్ణా జలాశయంలో పడి యువకుడి మృతి

**విజయపురి సౌత్:** ప్రమాదవశాత్తు సాగర్ కృష్ణా జలాశయంలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మాచర్ల మండలం విజయపురి సౌత్‌లో సోమవారం జరిగింది. ఎస్ఐ పి.అనిల్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం మాచర్లకు చెందిన వేముల శ్రీనివాసరావు(34) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వర్క్ ఫ్రమ్ హోంలో భాగంగా ఇంటి నుంచే పని చేస్తున్నాడు. రెండు రోజుల కిందట ఇంటిలో చెప్పి నాగార్జునసాగర్ వైపు వచ్చాడు. శ్రీనివాసరావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం గాలించారు. అనంతరం విజయపురి సౌత్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం శ్రీనివాసరావు మృతదేహం సాగర్ దిగువన జలాశయం వద్ద బయటపడింది. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# తీరంలో పటిష్ట భద్రతా చర్యలు

- యాత్రికుల రక్షణే ధ్యేయం
- ఎస్పీ వకుల్ జిందాల్
- 39 మంది ప్రాణాలు కాపాడిన పోలీస్ సిబ్బందికి అభినందన



సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

**బాపట్లటౌన్:** తీరంలో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రజల ప్రాణాలను కాపాడగలమని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలోని సూర్యలంక, వాడరేవు బీచ్‌లో కొట్టుకుపోతున్న యాత్రికుల ప్రాణాలను కాపాడిన సివిల్, మెరైన్ పోలీస్ సిబ్బందిని సోమవారం అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ తీరంలో పటిష్ట భద్రత చర్యలు ఏర్పాటు చేశామని చెప్పారు. యాత్రికుల రక్షణే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. సూర్యలంక సముద్రతీరంలో 2022లో 22 మందిని, 2023లో 8 మందిని, వాడరేవు సముద్రతీరంలో 2022లో 8 మందిని, 2023లో ఒకరిని మొత్తం 39 మంది యాత్రికుల ప్రాణాలను సివిల్, మెరైన్ పోలీస్, గజ ఈతగాళ్లు కాపాడారని ఎస్పీ పేర్కొన్నారు. ఈనెలలో జరిగిన రెండు ఘటనల్లో సిబ్బంది ప్రాణాలకు తెగించి ముగ్గురిని కాపాడారని వివరించారు. అనంతరం యాత్రికుల ప్రాణాలను కాపాడిన కొత్తపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎ.నరేష్‌బాబు, హోంగార్డు ఎస్.శ్రీనివాసరావు, సూర్యలంక మెరైన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.గంగాధర్‌రావు, హోంగార్డ్ ఎన్.శ్రీనివాసరావు, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.పోతురాజు, కానిస్టేబుల్ పి.వెంకటరావు, గజ ఈతగాడు సంగాని సురేష్‌ను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సూర్యలంక మెరైన్ సీఐ జి.సుబ్బారావు, కొత్తపట్నం మెరైన్ సీఐ కె.శ్రీనివాసరావు, జిల్లా ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రేపటి నుంచి జాతీయ నాటకోత్సవాలు



నాటకోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కళాంజలి సభ్యులు

**చీరాల అర్బన్:** కళాంజలి, చీరాల సాంస్కృతిక మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆరో ఉభయ తెలుగు రాష్ట్ర స్థాయి జాతీయ నాటకోత్సవాలను ఈనెల 10 నుంచి 14 వరకు స్థానిక కస్తూరిబా గాంధీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కళాంజలి కార్యవర్గ సభ్యులు తెలిపారు. సోమవారం కేజీఎం బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఉభయ తెలుగు రాష్ట్ర స్థాయిలో అనేక పరిషత్‌లలో ఉత్తమ నాటక ప్రదర్శనలుగా నిలిచిన పలు నాటికలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లుగా నాటకోత్సవాలను నిర్వహిస్తున్నామని, రోజూ సాయంత్రం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 14వ తేదీ సాయంత్రం గజల్ మేస్ట్రో గజల్ శ్రీనివాస్‌చే గజల్ విభావరి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కళాంజలి అధ్యక్షుడు కోడూరి ఏకాంబరేశ్వరబాబు, ఉపాధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి బత్తుల బ్రహ్మారెడ్డి, కోశాధికారి షేక్ దరియా సాహెబ్, కార్యవర్గ సభ్యులు పొట్టి శ్రీనివాసరావు, వడలి రాధాకృష్ణ, సమన్వయకర్త పూర్ణా సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య



వీరబ్రహ్మేంద్రరావు (పాతచిత్రం)

**బల్లికురవ:** ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యానన్న బాధతో ఓ విద్యార్థి పురుగుమందు తాగి ఐదు రోజులు మృత్యువుతో పోరాడి ఆదివారం అర్ధరాత్రి కన్నుమూశాడు. బాపట్ల జిల్లా బల్లికురవ ఎస్సై వి.వేమన కథనం మేరకు.. పెద అంబడిపూడి గ్రామానికి చెందిన గుంటుపల్లి శ్రీను, శ్రావణ సంధ్య దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వీరబ్రహ్మేంద్రరావు (19) మార్టూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం పరీక్షల్లో ఎక్కువ సబ్జెక్టుల్లో ఫెయిల్ అవడంతో తల్లిదండ్రులు మందలించారు. తాను ఇక పాస్ కాలేనని.. జీవితంపై విరక్తితో గత బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వీర బ్రహ్మేంద్రరావు పురుగులమందు తాగాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు అపస్మారక స్థితిలో ఉన్న కుమారుడిని వైద్యం నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ చనిపోయాడు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్సై వి.వేమన సోమవారం కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం వీరబ్రహ్మేంద్రరావు భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

# ఎస్సీ, ఎస్టీ చట్ట అమలులో అధికారుల నిర్లక్ష్యం

- ఐడియా జాతీయ అధ్యక్షుడు రాజసుందర్ బాబు
- సత్తెనపల్లిలో నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభం

**సత్తెనపల్లి:** ఎస్సీ, ఎస్టీ చట్ట అమలులో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ బాధితులకు అన్యాయం చేస్తున్న అధికారుల్ని బదిలీ చేయాలని సామాజికవేత్త, ఐడియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందర్ బాబు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి తాలూకా సెంటర్ వరకు పెద్దమక్కెన బాధితులు సోమవారం నీటి రంగు జెండాలతో ప్రదర్శన చేశారు. అనంతరం దీక్షల్ని రాజసుందర బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదమక్కెనలో సాంఘిక బహిష్కరణ జరిగి ఇరవై సంవత్సరాలు అయిందని, నేరం జరిగిందని కోర్టు కూడా నిందితులకు శిక్షలు కూడా వేసిందని గుర్తు చేశారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా పునరావాస సాయాలు అందించకపోవడం ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నిర్లక్ష్యం చేయడమే అవుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నిబంధనల్లో ఘటన జరిగిన ఏడు రోజుల్లోగా పరిహారాలు ఇవ్వాలని ఉన్నా, ఇరవై ఏళ్లయినా ఇవ్వకపోవడం మరో అత్యాచారం అవుతుందని పేర్కొన్నారు. పెద్దమక్కెన సంఘటన కోర్టులో నిరూపితమై దోషులకు శిక్షలు పడ్డ విషయం అధికారులు గుర్తించవలసిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా అధికారుల వైఖరిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించి రెండు నెలలైనా పట్టించుకోనందునే బాధితులు ఆందోళనకు దిగారని ఆయన వివరించారు. అత్యాచార బాధితులకు వ్యవసాయ భూమి ఇవ్వకుండా మొండిచెయ్యి చూపుతున్నారని విమర్శించారు. దీక్షలకు నాయకత్వం వహించిన ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టపల్లి చిన్నబాబు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ బాధితుల డిమాండ్లను ఒప్పుకునే వరకు దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. దీక్షలో సొపాటి శాంతకుమారి, మట్టపల్లి వీరమ్మ పాటు ఇరవై మంది మహిళలు కూర్చు న్నారు. అనంతరం తహసీల్దార్ నగేష్‌కు దీక్షలో పాల్గొన్న వారి జాబితాను అందజేశారు.


# కుల, మత, వర్గరహిత సేవలే రెడ్‌క్రాస్ లక్ష్యం

**నరసరావుపేట:** కుల, మత, వర్గ, వర్ణ భేదం లేకుండా విపత్తుల సమయంలో రక్తదానం, వైద్యసేవలు అందించడం రెడ్‌క్రాస్ లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో సంస్థ ప్రతినిధులతో కలసి వ్యవస్థాపకుడు సర్ జీన్‌హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్విస్ వ్యాపారవేత్త డ్యునాంట్ 1859 జూన్‌లో ఆస్ట్రో–సార్డినియన్ యుద్ధం జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించారన్నారు. ఆ సమయంలో ఒకే రోజు యుద్ధంలో రెండువైపులా దాదాపు 40,000 మంది సైనికులు మరణించటం, అనేక వేలమంది గాయపడటం చూశారని వివరించారు. యుద్ధం భయంకర పరిణామాలు, గాయపడిన సైనికుల బాధలు, వైద్యం అందకపోవడం, ప్రాథమిక సంరక్షణ లేకపోవడంతో డునాంట్ దిగ్భ్రాంతికి గురయ్యాడని చెప్పారు. వివక్ష లేకుండా క్షతగాత్రులకు ఉపశమనాన్ని అందించే సంస్థను ఏర్పాటు చేయాలని ఆయన ఆలోచించారని, దాన్నుంచి ఉద్భవించినదే రెడ్‌క్రాస్ సంస్థ అని వివరించారు. ఆ లక్ష్యాల కోసం పనిచేస్తున్న జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులను అభినందించారు. జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో స్థాపించిన నాటి నుంచి రక్తదాన శిబిరాలు, బ్లడ్ బ్యాంక్‌లు, వైద్య శిబిరాలు, విపత్తులలో నష్టపోయిన వారిని ఆదుకోవడం, ప్రథమ చికిత్సలతో పాటు ప్రతి సోమవారం స్పందనలో అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, వైస్ చైర్మన్ పి.వి.ఎం.శరత్‌బాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తుల మురళి, కె.ఎం.ఎస్.వి. శ్రీనివాస గుప్తా, గెల్లి వీరారెడ్డి, డాక్టర్ రహంతుల్లా, జిల్లా అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.

### పాలిసెట్ హాల్ టికెట్ల సమస్యలపై జిల్లా కోఆర్డినేటర్లను సంప్రదించాలి

**క్రోసూరు:** రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10న జరగనున్న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు సంబంధించి హాల్ టికెట్ల డౌన్‌లోడ్ సమస్య ఉన్న వారు ఎగ్జామ్ జిల్లా కోఆర్డినేటర్ల నంబర్లుకు 9440613009, 9640248529 ఫోను చేసి పొందాలని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్, క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రమాదేవి సోమవారం తెలిపారు. జిల్లాలో మొత్తం 3260 మంది పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, ఉదయం 10 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారని చెప్పారు. జిల్లాలో మొత్తం 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో చిలకలూరిపేటలో ఆరు, మాచర్లలో ఐదు కేంద్రాలున్నాయని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వెంట హాల్ టికెట్, బాల్‌పాయింట్ పెన్ను, హెచ్‌బీ పెన్సిల్ తీసుకువెళ్లాలని సూచించారు. హాల్ టికెట్ల డౌన్‌లోడ్ సమస్య ఉన్న వారు వెంటనే పై నంబర్లను సంప్రదించాలని ఆమె తెలిపారు.

# పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి



వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

- శ్రేణులకు ప్రభుత్వ విప్ పీఆర్కే పిలుపు
- మల్లవరంలో ఎనిమిది కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక

**రెంటచింతల:** గ్రామంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కార్యకర్తలు, అభిమానులు, నాయకులంతా సమష్టిగా కృషి చేయాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని మల్లవరంలో సోమవారం ఎనిమిది కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో కొర్రా ఏసురాజు నాయక్, కొర్రా మాంగ్యానాయక్, రమావత్ కస్నానాయక్, కొర్రా లక్ష్మీబాయి, కొర్రా బుగానిబాయి, రమావత్ గొన్యానాయక్, కొర్రా శ్రీనునాయక్, కొర్రా శివశంకర్ నాయక్ ఉన్నారు. వీరికి వైఎస్సార్ సీపీ కండువా కప్పి ప్రభుత్వ విప్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని గ్రామంలో కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలని తెలిపారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని, అవసరమైతే తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. పదవీ క్షాంక్షతో చంద్రబాబు, టీడీపీ నేతలు, పచ్చ మీడియా చేస్తున్న నీచమైన రాజకీయాల్ని గమనించి రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వారికి బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. మన పిల్లలకు బంగారు భవిష్యత్ కావాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వడితే బుడ్డ సైదానాయక్, బత్తుల కోటేశ్వరరావు, దొడ్డా గోపి, బత్తుల కొండ, షేక్ బాష, షేక్ బుగ్గల సైదా పాల్గొన్నారు.